# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- సామాజిక ఫించన్ల ద్వారా రాష్ట్రంలో సుమారు 62 లక్షల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- నూతన దక్షిణ కోస్తా రైల్వే జోన్ తో స్థానిక ఉద్యోగావకాశాలు భారీగా పెరుగుతాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు.
- డీఎస్సీ నియామ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.
- యోగాంధ్ర - 2026 పేరిట ఈ నెల 7వ తేదీ నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు.

====================

సామాజిక ఫించన్ల ద్వారా రాష్ట్రంలో సుమారు 62 లక్షల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పేదరికంలో ఉన్న అన్ని కుటుంబాలకు చేయూత నందించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఒక్కో కుటుంబానికి 3, 4 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాకినాడ జిల్లా చామవరంలో ఈరోజు జరిగిన `పేదల సేవలో` కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సభానుద్దేశించి ఆయన మాట్లాడుతూ... మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడంతో పాటూ మహిళలకు ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

విశాఖపట్టణం కేంద్రంగా 18వ రైల్వే జోన్‌గా "దక్షిణ కోస్తా రైల్వే జోన్" (SCoR) ఈరోజు నుంచి తన అధికారిక కార్యకలాపాలను ప్రారంభించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల సాకారమైందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. 3 వేల 532 కిలోమీటర్ల పరిధి, 4 డివిజన్లు, 385 స్టేషన్లతో విస్తరించిన ఈ జోన్ రాష్ట్ర రైల్వే రంగ ముఖచిత్రాన్ని మార్చడంతో పాటు.. స్థానిక ఉద్యోగావకాశాలను భారీగా పెంచనుందని సామాజిక మాధ్యమం పోస్ట్ లో వెల్లడించారు. నగరంలోని సిరిపురం కూడలి వద్ద ఉన్న వైజాగ్ డెక్ భవనంలో తాత్కాలికంగా కార్యకలాపాలు ప్రారంభం కాగా, త్వరలోనే 12 అంతస్తుల అత్యాధునిక శాశ్వత భవనం సిద్ధం కానుందని మంత్రి తెలియజేశారు. అదే విధంగా రైల్వే జోన్ కార్యకలాపాల ప్రారంభంతో పరిపాలనా వికేంద్రీకరణకు తోడ్పాటు లభించడంతో పాటు రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త ప్రాజెక్టుల అమలు, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణ, సరుకు రవాణా సామర్థ్యాల పెంపు వంటి అంశాల్లో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ ఆశాభావం వ్యక్తం చేశారు.

====================

మారుతున్న ఆధునిక జీవన శైలిలో మానసిక ప్రశాంతతకు, శారీరక ధృఢత్వానికి యోగా ఒక అద్భుతమైన మార్గమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. "యోగా ఫర్ హెల్తీ ఏజింగ్" అనే నినాదంతో ఈ ఏడాది 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోందని మంత్రి అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ చెప్పారు. యోగాను కేవలం ఒక్క రోజు మాత్రమే కాకుండా ప్రతీ ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే ఈ సారి యోగా డే ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. గత ఏడాది నిర్వహించిన యోగాంధ్ర - 2025 కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఒక ప్రజా ఉద్యమంలా సాగిందని చెప్పారు. ఈ ఏడాది యోగాంధ్ర - 2026 కార్యక్రమం ఈ నెల 7వ తేదీ నుండి ప్రారంభం కానుందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

ఉపాధ్యాయ నియామకాల కోసం గత ఏడాది చేపట్టిన డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... డీఎస్సీ నిర్వహణ, నియామకాల్లో ఎటువంటి  రాజకీయ ప్రమేయం లేదని తెలిపారు. స్పోర్ట్స్ కోటాకు సంబంధించి తప్పుడు సర్టిఫికెట్స్ ను ఎవరు సమర్పించినా అలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి డీఎస్సీ మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్ లోనే జరిగిందని తెలిపారు. డీఎస్సీ ఎంపికల్లో స్పోర్ట్స్ కోటాకు సంబంధించి వస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్తవాలు అని తెలియజేశారు. ఇదిలా ఉండగా డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని నినదిస్తూ... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నిరసనలు చేపట్టింది. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తోంది.

====================

మహారాష్ట్రలో పర్యటిస్తున్న రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈరోజు ముంబైలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మంత్రి లోకేశ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి విధానాలను ఆయనకు తెలియజేశారు. మహారాష్ట్ర ఐటీ, విద్యా శాఖలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలను మంత్రి లోకేశ్.. ఫడ్నవీస్ ను అడిగి తెలుసుకున్నారు.

====================

గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని దుగ్గసాగరం-పుల్లేరుగుడ్డివలస-వంగరగుడ్డివలస

గ్రామాల మధ్య సుమారు 4 కోట్ల 13 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణానికి మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గిరిజన గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం మరింత పెరుగుతుందని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి అవసరాల కోసం ప్రజలు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం కలుగుతుందని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించుకునే వీలు ఏర్పడుతుందని అన్నారు.

====================

రాష్ట్ర రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ ను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈరోజు ప్రారంభించారు.

====================

====================